క్లుప్తంగా

నేడు మావుళ్లమ్మకు శాకంబరి అలంకరణ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ విలవేల్పు శ్రీ మావుళ్లమ్మవారికి ఆదివారం శాకంబరి అలంకరణ చేయనున్నారు. అలంకరణ పనులను శనివారం ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మీ నగేష్ పరివేక్షించారు.

నేడు ధ్యాన శిక్షణ

ఆకివీడు: స్థానిక టెలిఫోన్ క్వార్టర్స్ ఎదురుగా శివ శక్తి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈ నెల 21వ తేదీ ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ ధ్యాన శిక్షణ–జ్ఞాన బోధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు నేరెళ్ళ ఈశ్వరరావు శనివారం తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో ధ్యానం చేసే విధానం, దాని వల్ల కలిగే లాభాల్ని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ పీబీ ప్రతాప్ కుమార్, ధాన్యరత్న డాక్టర్ ఉండ్రమట్ల సాంబ శివరావు వివరిస్తారని ఆయన తెలిపారు.

అంతర్జాతీయ చెస్ దినోత్సవం



డీఎన్నార్ స్కూల్లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

భీమవరం: అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని స్థానిక డీఎన్నార్ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. డీఎన్నార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఏకాగ్రత పెంచడానికి చెస్ దోహదం చేస్తుందని చెప్పారు. తొలుత కేక్ కట్‌చేసి విద్యార్థులకు ఇంటర్నేషనల్ చెస్ కిట్స్ పంపిణీ చేశారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్, స్కూల్ హెచ్‌ఎం నిర్మలకుమారి, సత్యమూర్తి, మురళీమోహన్, రాణి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అచీవర్స్ డే



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులు

భీమవరం: స్థానిక బీవీ రాజు కళాశాలలో డిగ్రీ పూర్తిచేసుకున్న విద్యార్థులకు శనివారం అచీవర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఐఆర్‌కే రాజు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో తమ కళాశాల విద్యార్థులు 217 మంది క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించారని, వారిలో రూ.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైన విద్యార్థులు ఉన్నట్టు చెప్పారు. వీరిని కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జె.ప్రసాద్‌రాజు అభినందనలు తెలపగా పి.శ్రీనివాసరాజు చేతులు మీదగా జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎస్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు భోజనం ప్యాకెట్లు



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక దుర్గాపురం, లంకపేటలో ప్రాంతాల్లో వర్షాలు కారణంగా ఇబ్బందులు పడుతున్న 40 మందికి శనివారం భోజనాలు అందించినట్టు శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న పేదల విషయం వీఆర్‌ఓ తెలపడంతో భోజనాలు అందించామన్నారు. మెంటేవారితోటలోని షెల్టర్ బాధితులు 64 మందికి మూడు రోజులపాటు భోజనాలు అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, కట్టా నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రసాదరాజు

భీమవరం అర్బన్: ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు అన్నారు. భీమ వరం మండలం చినఅమిరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రసాద్ కన్‌స్ట్రక్షన్స్ (ప్రాజెక్టు వర్క్స్) లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రసాదరాజు ప్రారంభించారు. ఉపాధ్యాయురాలు వి.అనురాధ, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ముంపులోనే రహదారులు

- భీమవరం పట్టణంలో పలు వీధులను వీడని ముంపు
- రాకపోకలకు ఇబ్బందులు
- ముంపునీరు ఇంజిన్లతో తోడకం



భీమవరం(ప్రకాశం చౌక్): నీటమునిగిన ఇండస్ట్రియల్ ఏరియాలోని ప్రధాన రోడ్డు



బీవీరాజు సర్కిల్ వద్ద డ్రెయిన్ గట్టును పటిష్టం చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భారీ వర్షాలకు మూడు రోజు శనివారం కూడా భీమవరం పట్టణంలో పలు వీధులు ముంపులో ఉన్నాయి. ప్రజలు నీటిలో రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లపుప్రాంతాలైన దుర్గాపురం, లంకపేట, చేపల మార్కెట్ ప్రాంతాల్లో వర్షపునీటిని మున్సిపల్ అధికారులు ఇంజిన్లతో బయటకు తోడిస్తున్నారు. బీవీరాజు సర్కిల్ వద్ద యనమదురు డ్రెయిన్ గట్టు బలహీనంగా ఉండడంతో గట్టును మట్టి, ఇసుక బస్తాలు వేసి పటిష్టం చేశారు. భీమవరం ఆర్టీసీ డిపో గ్యారేజి నీటమునగడంతో లోపల బస్సుల మరమ్మతులకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గ్యారేజి నుంచి వర్షపు నీటిని ఇంజిన్లతో నిర్విరామంగా తోడుతున్నారు. ఎడతెరిపివ్వని వర్షాలతో ఫుట్‌పాత్ వ్యాపారాలు ఉపాధి కోల్పోయారు. పట్టణంలో ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే అంజిబాబు పరిశీలించారు. యనమదుర్రు డ్రెయిన్ గట్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రత్తంగా ఉండాలని అధికారులను అదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

భీమవరం: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం పట్టణంలోని ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తున్నందున మూడో ప్రమాద హెచ్చరిక రాకముందే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చేపల మార్కెట్ వద్ద నుంచి ప్రకాశం ప్రకాశంచౌక్ యనమదుర్రు గట్టుపై ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామలను ఆదేశించారు. వర్షాలు తగ్గిన వెంటనే యనమదుర్రు కాలువ గట్టులను పటిష్టం చేయాలని, దీనికి టెండర్లు పిలవాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని మోటార్లతో బయటకు తోడించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చెన్నమల చంద్రశేఖర్, మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, పాత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, ఇందుకూరి రామలింగరాజు, మైలబత్తుల ఐజాక్‌బాబు తదితరులున్నారు.

నీటమునిగిన చేలు

వీరవాసరం: తుఫాను ప్రభావంతో భారీ వర్షాలకు వీరవాసరం మండలంలోని పల్లప్రాంతాల్లోని రోడ్లు, డ్రెయిన్లు పొంగి రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. కొణితివాడ, రాయకుదురు, వీరవాసరం, తోలేరు, తోకలపూడి, మచ్చిపురి తదితర గ్రామాల్లోని చేలల్లో వరి నాట్లు మునిగి చెరువులను తలపిస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో సార్వా సాగుకు కష్టాలు ఏర్పడ్డాయని రైతులు వాపోతున్నారు.

ఎన్ఆర్పీ అగ్రహారంలో..

ఉండి: కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం సాయంత్రం ఎన్నార్పీ అగ్రహారంలోని మెయిన్ విలేజ్‌లో ఓ పెద్ద వృక్షం విద్యుత్ లైన్లపై కూలింది. దీంతో మూడు స్తంభాలు విరిగిపోవడంతో పాటు విద్యుత్‌లైన్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉప్పొంగుతున్న ఉప్పుటేరు

ఆకివీడు: ఉప్పుటేరు నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. భారీ వర్షాలకు కురిసిన వర్షపు నీరు వివిధ డ్రెయిన్లు, పంట కాలువల నుంచి ఉప్పుటేరు, కొల్లేరు సరస్సులోకి చొచ్చుకువస్తుంది. కొల్లేరులోకి చేరిన అదనపు నీరు ఉప్పుటేరు గుండా సముద్రంలోకి చొచ్చుకుపోతుంది. ఆకివీడు ఆర్అండ్‌బీ వంతెన వద్ద శుక్రవారం నీటి మట్టం మూడు అడుగులు ఉండగా శనివారం 3.6 అడుగులకు చేరుకుంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. కొల్లేరులోకి ఎగువ ప్రాంతం నుంచి భారీగా ముంపు నీరు చొచ్చుకువస్తోంది. ఇప్పటికే కొల్లేరు సరస్సు తీరంలోని పలు గ్రామాలు, పంట పొలాలు నీట మునిగాయి. గ్రామాలను తాకుతూ నీరు ప్రవహిస్తుంది. బుడమేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ నీరు కొల్లేరులోకి చొచ్చుకువస్తే ముంపు బెడద తప్పదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పుటేరు నీటి ప్రవాహ సామర్థ్యం 20 వేల క్యూసెక్కులుండగా ఇటీవల ఆక్రమణలతోనూ, పూడికలతోనూ ఉప్పుటేరు సామర్థ్యం 12 వేల క్యూసెక్కులకు పడిపోయింది. వేసవికాలంలో 8 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. ప్రస్తుతం 12 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఇది మరింత ఉధృతంగా ప్రవహిస్తే కొల్లేరు తీర గ్రామాల్లోకి నీరు చొచ్చుకుపోయే అవకాశం ఉందంటున్నారు. ఉప్పుటేరులోకి కలిసే డ్రెయిన్లకు పలు చోట్ల షట్టర్లు, తలుపులు లేకపోవడంతో ఉప్పుటేరు నీరు డ్రెయిన్లు, పంట కాలువల్లోకి ఎదురు ప్రవహించే ప్రమాదం ఉందంటున్నారు.

తొలగని ఉప్పుటేరుకు సగం అడ్డుకట్ట

జాతీయరహదారికి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఉప్పుటేరుపై నిర్మిస్తున్న వంతెన కోసం ఉప్పుటేరును సగం వరకూ పూడ్చివేసి, భూమిలోకి పిల్లర్లు తీశారు. పనులు నిలిచిపోవడంతో ఉప్పుటేరులో వేసిన మట్టిని తొలగించకపోవడంతో అడ్డుకట్టగా ఆ ప్రాంతం ఉంది. దీంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కల్గే అవకాశం ఉంది. ఇప్పటికే ఉప్పుటేరులో ముంపు నీరు సుడులు సుడులుగా ప్రవహిస్తుంది. నీటి ఉధృతికి కొంత మట్టి కొట్టుకుపోయినా ఆటంకం తొలగే అవకాశం కనిపించడం లేదు. రైల్వే రెండవ లైన్ నిర్మాణంలో వేసిన మట్టి కూడా ఆ ప్రాంతంలో నీటి ప్రవాహానికి అడ్డంగా నిలిచింది.



భీమవరంలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు



యండగండి వైఎస్సార్ కాలనీ ముంపునకు గురికాకుండా వేసిన అడ్డుకట్టలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



ఆకివీడు వద్ద ఉప్పుటేరులో పెరుగుతున్న నీటి మట్టం



యనమదుర్రు డ్రెయిన్ ఉప్పొంగడంతో యండగండి, ఎస్ కొందేపాడు కాజ్‌వే పూర్తిగా మునిగిన దృశ్యం

మునిగిన వరి పొలాల పరిశీలన

పాలకోడేరు: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాలకోడేరు మండలంలో అన్ని గ్రామాల్లో నారుమడులు, నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురయ్యాయి. యనమదుర్రు కాలువకు వచ్చిన ఎర్రకాలువ ప్రవాహం వల్ల మండలంలోని వివిధ డ్రెయినేజీలు పొంగి పొర్లడంతో పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాంతాలను భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్ భీమవరం డీఆర్సీ వ్యవసాయ అధికారి బాల నాగేశ్వరమ్మ శనివారం గరగపర్రు, మోగల్లు, కోరుకొల్లు, మోగల్లులోని గుత్తుల వారి పాలెం వరి పంట పొలాలను, నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు సూచనలిచ్చారు. నారుమడులను రక్షించుకోవడానికి కార్బన్డిజం మందును పిచికారీ చేసుకొని ఐదు సెంట్లు నారుమడికి 2 కేజీలు ఎంటపీ, కేజీ యూరియా చల్లుకోవడం వల్ల నారుమడులను రక్షించుకోవచ్చని తెలిపారు. వర్షాలు తగ్గిన వెంటనే నారుమడుల్లో ఎక్కడైతే ముంపునకు గురై పాడైపోయిన వాటిచోట స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి వి. నారాయణరావు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్, అధికారులు

కుళ్లిన వరి నారు

ఆకివీడు: మండలంలోని పలు గ్రామాల్లోని పంట భూముల్లో రెండు, మూడు అడుగుల నీరు నిలబడి ఉంది. నారుమడులు పూర్తిగా నీట మునిగాయి. కొల్లేరు తీర గ్రామాలు, మండలంలోని మెరక భూములు నీట మునిగాయి. ఖరీఫ్‌కు వేసిన నారు పలు గ్రామాల్లో నాట్లు వేసేందుకు పనికిరాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. పంట, మురుగు కాలువల నుంచి ఉధృతంగా నీరు చేలల్లోకి చొచ్చుకువచ్చింది. నీరు బయటకు వెళ్లేందుకు మరో మూడు నాలుగు రోజులు పట్టే అవకాశం ఉందంటున్నారు. బుడమేరు, ఎర్రకాలువ నీరు కూడా దిగువకు చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందంటున్నారు. ముంపునకు గురైన ప్రాంతాలను ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏఓ ప్రియాంక, ఆర్బీకే ఇన్‌ఛార్జిలు పర్యటించి పరిశీలిస్తున్నారు. మండలంలో మెరక ప్రాంతమైన అజ్జమూరు, కుప్పనపూడిలోని నారు మడులు మునిగిపోవడం దారుణమని ఆదర్శ రైతు నంద్యాల చాల్లారావు చెప్పారు. ఖరీఫ్ సాగుకు ప్రస్తుత నారుమడుల్లోని ఆకు ఊడ్చడానికి పనికిరాదన్నారు. రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముంపులో లోతట్టు ప్రాంతాలు

ముంపునీటితో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని చినమిల్లిపాడు, కాళింగగూడెం, కురుపాక, మాదివాడ, ఆకివీడు, పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, మందపాడుతో పాటు అజ్జమూరు, కుప్పనపూడిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముంపునీరు మరింతగా పెరిగితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

ముంపు బారిన వరి నాట్లు

ఉండి: మండల వ్యాప్తంగా సుమారుగా వెయ్యి ఎకరాల్లో నాట్లు వేసిన వరి చేలు, సుమారుగా 230 ఎకరాల్లో నారుమళ్లు ముంపునకు గురయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ముంపు ప్రభావం మరింతగా ఉంటుందని రైతులు అన్నారు. డ్రెయిన్లు, కాలువల్లో నీరు తగ్గుముఖం పట్టకపోతే వరినారు, నాట్లు కుళ్లిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఆకివీడు: అజ్జమూరు ఆయకట్టులో నీట మునిగిన ఆకుమడులు, పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



ఆకివీడు: కుప్పనపూడిలో నీట మునిగి కుళ్లిపోతున్న వరి నారును పరిశీలిస్తున్న రైతులు

చేలల్లోని వరద నీటిని బయటకు పంపించాలి



ఉండిలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, ఏడీఏ, ఏఓ

ఉండి: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు సుమారుగా వరిపంట నాట్లు వేసిన చేలు, వరి నారుమళ్లు పూర్తిగా మునిగిపోయాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో పుంపు బారిన పడిన వరి చేలను పరిశీలించేందుకు శనివారం వెంకటేశ్వరరావుతో పాటుగా ఏడీఏ కే శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి బి సంధ్య సంయుక్తంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఉండిలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు రైతులతో మాట్లాడుతూ వర్షం తగ్గిన వెంటనే రైతులు సమాయత్తమై వరి పొలాలు, నారుమళ్లల్లోని వరద నీటిని బయటకు పంపించాలని తెలిపారు. ఏడీఏ మాట్లాడుతూ ఉండి మండలంలోని అన్ని గ్రామాల్లోని వరి పంట నీట మునిగిందని అన్నారు. మండలంలో 2,800 ఎకరాల్లో నాట్లు వేయడం పూర్తయ్యిందని వాటిలో 1000 ఎకరాల వరకు పూర్తిగా నీటిలో మునిగాయని అన్నారు. 230 ఎకరాల్లో నారుమడులు ముంపుబారిన పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జే అల్‌ఫ్రెడ్,పలువురు రైతులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో అజ్జాలమ్మ

ఆకివీడు: గ్రామ దేవతను శాంతింపజేయడం ద్వారా ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తారని ప్రజల నమ్మిక. ఆ ప్రకారంగా ఆషాఢ మాసంలో అమ్మవారికి సారెలు, చీరలు, జాకెట్, గాజులు, పూలతో ప్రత్యేకంగా పూజించడం ద్వారా మహిళలకు మంచి జరుగుతుందని పలువురు మహిళలు అమ్మవార్లకు సారెలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రైతులు సుఖ సంతోషాలతో ఉండే విధంగా, ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడాలని కోరుతూ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. మండలంలోని అజ్జమూరులో మహిమ కలిగిన అజ్జాలమ్మవారికి శనివారం ఆషాఢ మాస సారెలు సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



అజ్జమూరులో అజ్జాలమ్మవారిని శాకంబరి అలంకరణలో దర్శించుకుంటున్న భక్తులు.

విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ

కాళ్ల: సీసలి గ్రామంలో శిరిడి సాయిబాబా ఆలయంలో పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గురు పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో ఏటా పేద విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం అందజేస్తారు. దీనిలో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి ఆధ్వర్యంలో సేవకుల పిల్లలకు ఆర్థిక సాయం అందజేశారు. ఐదు నుంచి పీజీ వరకు చదువుతున్న 150 మంది విద్యార్థులకు రూ.3 లక్షలు విద్యా ప్రోత్సాహంగా సత్యవతి దేవి చేతుల మీదగా అందజేశారు. 21వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 3వేల మంది భక్తులతో బాబా వారికి అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ వాస్తవ్యులు మేడేపల్లి మల్లికార్జునరావు పావని దంపతులతో అన్న సమారాధన నిర్వహిస్తున్నామన్నారు.



సీసలి సాయిబాబా ఆలయంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న అనంతలక్ష్మి సత్యవతి దేవి

వైభవంగా గురుపూర్ణిమ ఊరేగింపు



ఉండిలో గురుపూర్ణిమ సందర్భంగా ఊరేగింపులో కోలాటమాడుతున్న భక్తులు

ఉండి: ఉండి లక్ష్మీ గణపతి దత్తసాయి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుపూర్ణిమ మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామివారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. శనివారం ఉండిలోని ప్రధార రహదారుల ద్వారా నిర్వాహకులు ఊరేగింపు నిర్వహించగా వర్షంలోనూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ స్వామి బాబావారి ఊరేగింపు కార్యక్రమాన్ని బాణ సంచాతో, కోలాటం, నామసంకీర్తనలతో ఘనంగా నిర్వహించారు. రెండవరోజు ఆదివారం నిర్వహించే కార్యక్రమాల్లో అఖండ అన్నసమారాధనతో గురుపూర్ణిమ మహోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షుడిగా రాము

కాళ్ల: ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ముసుకుడి రాము ఎంపికైనట్లు రాము శనివారం తెలిపారు. కాళ్ల మండలం జక్రం గ్రామానికి చెందిన ముసుకూటి రామును 20న నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు బుల్లా రాజారావు సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు ఎస్టీ, ఎస్సీలకు సక్రమంగా అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా రాము తెలియజేశారు.

ముంచెత్తుతున్న వరద నీరు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాలు ఉండి కాలువ ఉధృతికి ముంపు బారిన పడ్డాయి. శనివారం రాత్రి కాలువగట్లపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఉండి శివారు, ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీల్లోకి నీరు చేరింది. ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీ వద్ద కాలువగట్టుకు మట్టి బస్తాలు వేయడంతో కొంత మేర వరద ఉధృతిని నివారించారు. ఉండి 1వ వార్డు ఎస్సీ ఏరియా మాత్రం ముంపు బారిన పడింది. మూడు చోట్ల కాలువగట్టుపై నుంచి ప్రవహించడంతో వీధుల్లోకి వరదనీరు చేరింది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.తహసీల్దార్ కె.శ్రీనివాస్ సంబంధిత ప్రాంతాలను పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు.